క్లుప్తంగా

శక్తి యాప్‌తో మహిళలకు భరోసా



మాట్లాడుతున్న సీఐ మల్లేశ్వరి

గోపాలపట్నం: శక్తి యాప్‌తో మహిళలకు భరోసా లభిస్తుందని సీఐ మల్లేశ్వరి అన్నారు. గురువారం ఉదయం గోపాలపట్నం బాలాజీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దీని వల్ల మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు. ఈ యాప్‌ను ఏవిధంగా వాడాలో వివరించారు. అనంతరం ఉపాధ్యాయుల ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దివ్యభారతి, హెచ్‌సీ వెంకటరావు, కానిస్టేబుళ్లు జగన్నాథం, లీలా పార్వతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఓనం వేడుకలు



ఓనం వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిథమ్ క్లబ్ విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. విద్యార్థులకు నిర్వహించిన ఓనం రంగవల్లికల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలకు సిస్టర్ మార్గరిత్, సిస్టర్ అనసీ, డాక్టర్ నళినీదత్త న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రి పరిశీలన



సమావేశంలో హెచ్‌ఎస్‌ఎల్ జీఎం మహాపాత్ర, చంద్రశేఖర్ తదితరులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రిని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం సందర్శించారు. గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రి డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో హిందుస్తాన్ షిప్‌యార్డ్ టెక్నికల్ జనరల్ మేనేజర్ మహాపాత్రతో సమావేశమయ్యారు. గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రికి అద్దె లేకుండా చూడమని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన షిప్‌యార్డ్ సంస్థ గతంలో లాగానే అద్దె చెల్లించకుండా ఆస్పత్రిని కొనసాగించుకోవచ్చని అంగీకరించినట్లు డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు.

ఆవిష్కరణల దిశగా పనిచేయాలి

మద్దిలపాలెం: విద్యార్థులు ఆవిష్కరణల దిశగా పని చేయాలని భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐటీ హైదరాబాద్ పూర్వ సంచాలకులు జి.నరహరి శాస్త్రి సూచించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ఎండోమెంట్ లెక్చర్‌లో భాగంగా గురువారం ఆయన ప్రసంగించారు. నేటి సమాజంలో రసాయన శాస్త్రం, బయాలజీ, ఏఐ టెక్నాలజీలను మిళితం చేస్తూ జరుగుతున్న పరిశోధనలను వివరించారు. 2024 సంవత్సరానికి నోబెల్ బహుమతిని రసాయన శాస్త్రవేత్త, టెక్నాలజిస్టుకు సంయుక్తగా అందించిన విధానం, వారు చేసిన పరిశోధనలను విద్యార్థులకు వివరించారు. ఆత్మగౌరవంతో స్వయం సమృద్ధి దిశగా సాగాలని సూచించారు. ఏఐ అనువర్తనాలు, అభివృద్ధిని తెలిపారు. ఊహకందని వేగంతో అభివృద్ధి జరుగుతోందన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ నూతన జ్ఞానాన్ని అందిస్తూ, విస్తృత అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. ఆచార్య నరహరి శాస్త్రి పరిశోధన విధానం, సాధించిన ప్రగతి నేటి తరం యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. శాస్త్ర విజ్ఞాన నాయకత్వానికి ఉదాహరణగా ఆయన నిలుస్తారన్నారు. అనంతరం వర్సిటీ తరపున ఆచార్య నరహరి శాస్త్రిని సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, మాజీ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, విభాగాధిపతి ఆచార్య శ్యామల పాల్గొన్నారు.



మల్కాపురం స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళలు

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రోడ్డున పడ్డ బతుకులు
- భారమైన కుటుంబ పోషణ, అప్పుల చెల్లింపులు
- పారిశ్రామిక ప్రాంతంలో ఖాళీగా తిరుగుతున్న ఆటోలు
- తమను ఆదుకోవాలంటూ ఆటో కార్మికుల వేడుకోలు



పారిశ్రామిక ప్రాంతంలో ఖాళీగా తిరుగుతున్న ఆటోలు

ఆటోవాలా.. విలవిల



శ్రీహరిపురం బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలు, విద్యార్థినులు

మల్కాపురం: స్త్రీ శక్తి పథకం పేరిట కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధికి గండి పడింది. ఈ పథకం వల్ల ఆదాయాన్ని కోల్పోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఆటోల కోసం చేసిన అప్పులు చెల్లించలేకపోతున్నామని పారిశ్రామిక ప్రాంత ఆటోవాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోజుకు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఆటో నడిపి సంపాదించే వారు నేడు రూ.300 నుంచి రూ.400 సంపాదనకే పరిమితమవుతున్నారు. దీంతో అటు అప్పులు తీర్చలేక.. ఇటు ఇంటి ఖర్చులకు డబ్బులు ఇవ్వలేక దయనీయ స్థితికి చేరారు.

ఆటో కార్మికుల కడుపు కొట్టే పథకం



స్త్రీ శక్తి పథకం వల్ల అనేక మంది ఆటో డ్రైవర్లు నేడు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తమను వాహన మిత్ర పథకం ద్వారా ఆదుకుంటే, కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టి మమ్మల్ని రోడ్డుకు నెట్టింది. ప్రభుత్వం అందరికీ న్యాయం చేసేలా పథకాలు అమలు చేయాలి.

– నీలాపు చిన్నా, ఆటో డ్రైవర్

ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలి



మా లాంటి డ్రైవర్ల జీవితాలు బాగుంటాయని భావించి కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపిస్తే.. నేడు మా బతుకులతోనే వారు ఆటలాడుతున్నారు. స్త్రీ శక్తి పథకం కొందరికి మేలు.. తమలాంటి వారికి కీడు అన్న మాదిరిగా ఉంది. ఆటో కార్మికుల సమస్యను కూటమి పాలకులు అర్థం చేసుకుని న్యాయం చేయాలి.

– రెడ్డి శ్రీను, ఆటో డ్రైవర్

1,400 ఆటోలు.. ఖాళీగానే!

పారిశ్రామిక ప్రాంతం సింధియా నుంచి జింక్ వరకు సుమారు 1,400 ఆటోలు, 11 ఆటో స్టాండ్‌లు ఉన్నాయి. ఒక్కో ఆటో డ్రైవర్ భార్య, ఇద్దరు పిల్లల కుటుంబ బాధ్యతను చూసుకుంటున్నారు. ఒక్కప్పుడు ఆటో డ్రైవర్ లైన్ మీద తిరిగితే రోజుకు రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు సంపాదించేవారు. గత నెల రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ప్రవేశ పెట్టడంతో మహిళలు ఆర్టీసీ బస్సు ప్రయాణం ఉచితం కావడంతో వాటిలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో ఆటో ప్రయాణానికి డిమాండ్ తగ్గింది. పారిశ్రామిక ప్రాంతంలో అనేక ఆటోలు ఖాళీగానే తిరుగుతున్నాయి. ఈ ఫలితంగా ఆటో డ్రైవర్లు రోజుకు రూ.300 నుంచి రూ.500 సంపాదించడం గగనంగా మారింది. చాలా మంది ఆటోవాలాలు బ్యాంక్ లోన్లు తీసుకుని ఆటోలు కొన్నారు. ఆ అప్పులు కట్టలేక, ఇంటి ఖర్చులకు డబ్బులు కేటాయించలేక, పిల్లలను చదవించుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

స్త్రీ శక్తి పథకం తమ కడుపు కొట్టిందని ఆటో కార్మికులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా ఆర్థిక సాయం అందించి, ఆదరించిదని, కూటమి ప్రభుత్వం ఇలాంటి పథకం ఏదైనా పెట్టి తమను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. లేదా ప్రతి నెలా జీతం మాదిరిగా ప్రభుత్వం తమకు నగదు ఇచ్చి ఆదుకోవాలని, బ్యాంకు రుణాలనైనా మాఫీ చేయించాలని ఆటోవాలాలంతా కోరుతున్నారు.

గణపతి మండపాల వద్ద అన్నసమారాధనలు



శ్రీనివాస్‌నగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న సీఐ గొలగాని అప్పారావు తదితరులు



అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ 59వ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ తదితరులు

మల్కాపురం: వినాయక నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో గణపతి మండపాల వద్ద గురువారం అన్నసమారాధనలు చేపట్టారు. జీవీఎంసీ 58వ వార్డు శ్రీనివాస్‌నగర్ వద్ద మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు యాదవ్ పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు.

- జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూ నగర్ వద్ద మండపంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు.
- 61వ వార్డు ప్రకాష్‌నగర్ వద్ద అంబేడ్కర్ కల్చరల్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు రావాడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గా యూత్ అండ్ స్టార్ మహిళల ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నసమారాధనను విప్ గణబాబు తనయుడు మౌర్యసింహ ప్రారంభించారు. అనంతరం మల్కాపురం జాలారి వీధిలో హాట్ గైస్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి దీపారాధన



శాంతినగర్ వినాయక మండపం వద్ద గణపతి రూపంలో దీపారాధన



గోపాలపట్నం ప్రధాన రహదారిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం సాయంత్రం దీపారాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు శాస్త్రోక్తంగా పూజలు జరిపి 1,108 దీపాలతో వెలిగించి గణపతిని ఆరాధించారు. మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు పాల్గొని తొలి దీపం వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఇక్కడి మండపంలో భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో శాంతినగర్ యూత్ నాయకుడు జియ్యాని విజయ్, మారుతి, శాంతినగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో అన్నదానం

గోపాలపట్నం ప్రధాన రహదారిలో గురువారం భారీ అన్నదానం జరిగింది. గోపాలపట్నం వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

పుస్తెల తాడు దొంగలను వెతికితే...
బైక్‌ల దొంగలు దొరికేశారు..!

- ఇద్దరు నిందితుల నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఆరిలోవ క్రైం పోలీసులు

ఆరిలోవ: పుస్తెల తాడు తెంపుకుపోయిన దొంగల కోసం వెతికితే ఏకంగా ఆరు ద్విచక్ర వాహనాలు దొంగలించిన ఇద్దరు దొంగలు పోలీసులకు చిక్కారు. అయితే ఆ ఇద్దరు నిందితుల్లో ఒకరు బాలుడు కావడం గమనార్హం. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జాతీయ రహదారిపై వాకింగ్‌కు వెళ్లిన ఓ మహిళ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడు దొంగిలించిన ఇద్దరిని ఆరిలోవ క్రైం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు.

జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌కు చెందిన కృష్ణవేణి (49) గత నెల 25న వాకింగ్ చేస్తున్న సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని పుస్తెల తాడు తెంపుకుని పరారయ్యారు. దీనిపై అదే రోజు ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో ఆరిలోవ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ద్వారకా క్రైం సీఐ వి.చక్రధర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ ఎ.హరికృష్ణ సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలించారు. దొంగతనం జరిగిన ప్రాంతం నుంచి సీసీ కెమెరాలు పరిశీలించి నగరంలో ఓ చోట ఇద్దరు నిందితులను గురువారం పట్టుకున్నారు. వారు చినవాల్తేరు ప్రాంతానికి చెందిన యరమశెట్టి అవిక్ కుమార్ (19)తోపాటు మరో బాలుడు అని నిర్ధారించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌ల దొంగతనం విషయం వెలుగులోకి వచ్చినట్లు ఎస్‌ఐ హరికృష్ణ తెలిపారు. వారు మహిళ మెడలో దొంగలించిన పుస్తెల తాడు గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించేసి రెండు ఫోన్లు కొనుక్కుని, మిగిలిన డబ్బులు ఖర్చు చేసేసినట్లు తెలిపారు. వారి నుంచి ఆ రెండు ఫోన్లతోపాటు గతంలో గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన మూడు ద్విచక్ర వాహనాలు, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన రెండు ద్విచక్ర వాహనాలు, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఒక మోటార్ సైకిల్, ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలించిన రూ.500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల్లో అవిక్ కుమార్‌ను కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు తరలించగా, బాలుడిని బాలుర ప్రత్యేక గృహానికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మల్కాపురం: ములగాడ ఫీడర్ పరిధిలోని 58, 59 వార్డుల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ములగాడ హౌసింగ్ కాలనీ, కొత్త నక్కవానిపాలెం, చెక్‌పోస్ట్ ఏరియా, గాజువాక డిపో, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, హనుమాన్‌నగర్, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

- ములగాడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పేర్కొన్నారు. ఈ మేరకు ములగాడలోని హరిజన వీధి, జాలరి వీధి, శెట్టిబలిజ వీధి, వెంకన్నపాలెం, సెవెన్ టెంపుల్ జంక్షన్, నగరాలు వీధి, ఏకేసీ కాలనీ, కేకేఎల్ జీవీఎంసీ పంప్‌హౌస్, ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏరియా, ఐఎంయూ, సీఈఎమ్మెస్, సింధియా జంక్షన్, పోస్టాఫీస్ ప్రాంతం, మసీద్ ప్రాంతం, కాకర్లోవ, జయేంద్ర కాలనీ, చింతల్లోవ, క్రాంతినగర్, బీపీసీఎల్ గొడౌన్, వై జంక్షన్, డాక్‌యార్డు ఏరియా, నవయుగ, ఈబీపీఎల్, శాతవాహనా బస్టాప్ ప్రాంతం, కాకాతీయ గేట్ ప్రాంతం, ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణి హాస్పిటల్ ఏరియా, చింతామణి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంన్నారు.
- త్రినాథపురం ఫీడర్ పరిధిలోని గాంధీ వీధి, రజక వీధి, పల్లి వీధి, క్రాంతినగర్, త్రినాథపురం ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

ఆరోగ్య కేంద్రాల్లో 63 పరీక్షలూ చేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన 63 టెస్టులు జరగాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో మలేరియా అధికారులు, అసిస్టెంట్ మలేరియా అధికారులు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లతో గురువారం ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఐవీఆర్‌ఎస్ ప్రకారం మన జిల్లా వైద్య పరీక్షల్లో వెనుకబడి ఉందన్నారు. అన్ని టెస్టులకు అవసరమైన కెమికల్స్ సరఫరా చేయాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ సిహెచ్.సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభనగర్‌లో మెడికల్ క్యాంప్

దోమల నిర్మూలనకు చర్యలు



పద్మనాభనగర్‌లో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



కాలువలో దోమల మందు పిచికారీ చేస్తున్న మలేరియా సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: పద్మనాభనగర్‌లో జ్వర పీడితుల కోసం గురువారం ప్రత్యేకంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ముత్యమాంబ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు కాలనీల్లో కలియతిరిగి జ్వరాల బాధితులను తీసుకువచ్చి వైద్యం అందించారు. ఈ ప్రాంతంలో ప్రబలుతున్న సీజనల్ జ్వరాలపై 'జ్వరాల పంజా' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పద్మనాభనగర్‌లో ఉదయాన్నే జీవీఎంసీ ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, ఎస్‌ఎస్ వెంకటరమణ పర్యటించారు. స్థానికులకు సీజనల్ జ్వరాలపై మలేరియా విభాగం అధికారులు, సచివాలయం సిబ్బంది అవగాహన కల్పించారు. మలేరియా సిబ్బంది ఉరుకులు పరుగులతో ఇంటింటికీ వెళ్లి దోమల లార్వాలు, నిల్వ నీటిని పరిశీలించారు. కాలువల్లో మందు పిచికారీ చేశారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టారు. అధికారులు స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేసి, 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం



కొత్తగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు

మల్కాపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (గాజువాక డివిజన్) నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గాజువాక డివిజన్ పరిధిలో జరిగిన కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత పరిధి 14 సబ్‌స్టేషన్‌ల నుంచి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని పాలక వర్గ సభ్యులను, ప్రతినిధులను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వి.వి.స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.మురళి, కో – ఆర్డినేటర్‌గా కె.సుబ్రహ్మణ్యంమూర్తి, ప్రధాన కార్యదర్శిగా వి.సత్తిబాబు, ఫైనాన్స్ సెక్రటరీగా ఎం.శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా ఎస్.శేఖర్‌బాబు, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఈ నెల 9న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సమావేశానికి సంఘం సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులంతా తరలిరావాలని కోరారు.

ఆకట్టుకుంటున్న 'పాప్‌కార్న్ వినాయకుడు'



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



ప్రకాష్‌నగర్‌లో పాప్‌కార్న్‌తో తయారు చేసిన వినాయకుడు

మల్కాపురం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలో యాదవ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నారులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో దీపారాధన జరిపారు. కార్యక్రమంలో యాదవ్ యూత్ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

- 61వ వార్డు ప్రకాష్‌నగర్‌లో అంబేడ్కర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 కేజీల పాప్‌కార్న్‌తో తయారు చేసిన 13 అడుగుల వినాయకుడి విగ్రహం అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ గణపతిని భారీగా భక్తులు దర్శించుకుంటున్నారు.

ఏఎంసీకి నాగశిరోమణి పార్థివదేహం అప్పగింత



నాగశిరోమణి పార్థివ దేహాన్ని ఏఎంసీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

మహారాణిపేట: మురళీనగర్‌కు చెందిన వల్లభనేని నాగ శిరోమణి(76) గురువారం మృతి చెందారు. ఈమె భర్త వల్లభనేని వీర రాఘవయ్య(లేట్) కూడా శరీరదాతల సంఘంలో సభ్యుడిగా ఉన్నారు. ఈ దంపతులు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గతంలోనే శరీరదాన పత్రాలు రాసి ఇచ్చారు. గురువారం నాలుగు గంటలకు విశాఖ జిల్లా శరీర దాతల సంఘం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు ఆధ్వర్యంలో నాగ శిరోమణి పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు అందజేశారు. శరీర దాత నాగ శిరోమణికి సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగ శిరోమణి కుమారుడు వెంకట రాజశేఖర్, కుమార్తె అనురాధ, బంధుమిత్రులు పాల్గొన్నారు.